క్లుప్తంగా

15న మండల మీట్

కలకడ : మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 15 నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌రహీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్న మండలమీట్‌కు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో మండలాభివృద్ధి, శాఖల వారి ప్రగతిని వేదికలు, గ్రామాలలో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఎంఆర్‌సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలో 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అందిన పాఠ్య పుస్తకాలను ఎంఆర్‌సీలో భద్ర పరిచామని ఎంఈఓ-టూ గౌస్‌పీర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 4,115 పాఠ్య పుస్తకాలు, 2850 జతల యూనిఫాం మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికే బోర్లు

కలకడ : గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిస్కారం కోసం నూతన బోర్లు వేయిస్తున్నట్లు రాతిగుంటపల్లె సర్పంచ్ అలివేలమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఎగువబట్టావారిపల్లె వద్ద ఒక బోరు, ముత్యాలమ్మ ఆలయంవద్ద ఒక బోరు వేసినట్లు సర్పంచ్ తెలిపారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు పేర్లు నమోదు చేసుకోండి

పీలేరు : అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఈ నెల 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో రమాదేవి అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింది రూ. 20 వేల ఆర్థిక సాయం మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని తెలిపారు. ఆర్థికసాయం పొందాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రంలో తమ ఆధార్ నెంబరు, భూమి వివరాలు, వెబ్‌ల్యాండ్ సమాచారం సక్రమంగా ఉందోలేదో సరి చూసుకుని ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

కలికిరి: రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి గాయాపాలైన ఘటన సోమవారం ఉదయం కలికిరి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా...వాల్మీకిపురం మండలం టి.సాకిరేవుపల్లికి చెందిన మదన్‌కుమార్ కలికిరిలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చేదువుతున్నాడు. సోమవారం ఉదయం స్వగ్రామం నుంచి కళాశాలకు వస్తుండగా కలికిరి సమీపం తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి ఫ్లెఓవర్ బ్రిడ్జి కింద జీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన టిప్పర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర రక్తగాయాలు కావడంతో కలికిరి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

చెన్నకేశవస్వామికి విశేష పూజలు


శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి విగ్రహాల ఊరేగింపు

పీలేరు రూరల్ : స్థానిక మదనపల్లె మార్గంలోని పింఛానది ఒడ్డున వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. సోమవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం స్వామి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సారూ.. సమస్యలు పరిష్కరించండి


సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీలు అందిస్తున్న బాధితులు


క్వారీలతో రోడ్లు, కాలువలు దెబ్బతింటున్నాయని బండకాడపల్లె వాసుల నిరసన

- సబ్ కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు స్వీకరించిన సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : సార్.. దూరప్రాంతాల నుంచి ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నాం. సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇస్తూనే ఉన్నాం. అయితే క్షేత్రస్థాయిలో మా సమస్యలు ఏ మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ఇంకెన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరగాలయ్యా అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి మా సమస్యలు పరిష్కరించండయ్యా అంటూ సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొరపెట్టుకున్నారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు అర్జీలు అందజేసి బాధను పంచుకున్నారు.

క్వారీలతో రోడ్లు, కాలువలు డ్యామేజీ...

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ బండకాడపల్లెలో క్వారీల కారణంగా రోడ్లు, కాలువలు డ్యామేజీ జరిగి గ్రామం దుర్గంధభరితంగా తయారైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి...క్వారీ యాజమాన్యం నుంచి వసూలుచేస్తున్న సెస్సును, స్థానికంగా ఉన్నటువంటి పంచాయతీలకు నిధుల రూపంలో మంజూరుచేయాలని కోరారు. ఈ నిధులతో గ్రామానికి అవసరమైన మౌలికవసతులను కల్పించుకుంటామని కోరారు.

మసీదు స్థలాన్ని కాజేస్తున్నారు..

కోళ్లబైలు గ్రామం డీవీజే జగన్‌కాలనీలో ఆజం మసీదు వెనుకవైపు స్థలాన్ని అదే గ్రామానికి చెందిన షేక్ గఫ్ఫార్‌సాబ్, మహబూబ్‌బాషా, మున్నా తదితరులు ఫేక్ పట్టాలు సృష్టించి కాజేయాలని చూస్తున్నారని మజీదే ఆలం యూత్ కమిటీ సభ్యులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. మసీదు నిర్మించి 15 ఏళ్లు అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు దానికి సంబంధించి ఎలాంటి లెక్కలు చూపించకుండా, దౌర్జన్యంగా మసీదు స్థలాన్ని ఆక్రమించేస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు అధికారులు ఎలాంటిచర్యలు తీసుకోలేదని, మసీదు స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడాల్సిందిగా కోరారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

మదనపల్లె మండలం వలసపల్లె రెవెన్యూ విలేజ్ సర్వేనెం.517లోని వందేళ్లుగా పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్నటువంటి 19.20 ఎకరాల భూమికి సంబంధించి కోర్టులో సివిల్ కేసు కారణంగా సబ్ డివిజన్, రీసర్వే జరపకుండా ఉంచామన్నారు. అయితే ప్రస్తుతం ఆ స్థలాన్ని రియల్టర్ అయినటువంటి జి.రామమూర్తినాయుడు, కొందరు వ్యక్తులతో కలిసి దౌర్జన్యంగా భూమిలోకి ప్రవేశించి ఆక్రమించుకుని చదును చేసేందుకు ప్రయతిస్తున్నాడని పూలరెడ్డెప్ప సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదుచేశారు. వారసత్వంగా వచ్చిన తమ భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించి, పోలీసురక్షణ కల్పించాల్సిందిగా కోరారు.

అనుభవంలోని భూమికి పట్టా ఇప్పించండి...

నిమ్మనపల్లె మండలం అగ్రహారం బండమీదపల్లె హరిజనవాడకు చెందిన బి.సరస్వతి..గ్రామంలోని సర్వేనెంబర్.275లోని ప్రభుత్వ బంజరుభూమిని, తమకు ఎలాంటి భూమి లేనందున జీవనోపాధికి కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు తెలిపింది. దీనికి తమకు పట్టా మంజూరు చేయాల్సిందిగా పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయిందన్నారు. అయితే ఆ భూమిని గ్రామానికి చెందిన ఇర్రి నిర్మల పేరుతో 15 సెంట్లు భూపంపిణీలో పట్టా మంజూరుచేశారన్నారు. నిర్మల ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులున్నారని, భూపంపిణీకి వారు అర్హులు కాదని తెలిపింది. తాము సాగుచేసుకుంటున్న భూమిని, భూపంపిణీలో తమకే పట్టా మంజూరుచేయాలని వేడుకుంది.

ఆరోగ్య సంరక్షణలో నర్సుల సేవలే కీలకం

మెడికల్ సూపరింటెండెంట్ కోటేశ్వరి


ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నర్సులను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె రూరల్ : ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల సేవలే కీలకమని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ కోటేశ్వరి అన్నారు. సోమవారం నర్సింగ్ డే సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ యుద్ధ సమయంలో క్షతగాత్రులకు నైటింగేల్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నైటింగేల్ సేవలను గుర్తించి మే 12న అంతర్జాతీయ నర్సింగ్ డే గా జరుపుకుంటున్నామన్నారు. రోగుల ఆరోగ్యం మెరుగుపరచటం కోసం నర్సులు నిరంతరం శ్రమించటం అభినందనీయమన్నారు. నర్సు వృత్తిలో ఉన్నవారి శ్రమను గుర్తించి ప్రోత్సహించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎందరో రోగుల ఆరోగ్యం మెరుగు అయ్యేందుకు సేవలు చేస్తున్న, నర్సుల పాముఖ్యత ప్రజలు గుర్తించాలన్నారు. అనంతరం నర్సింగ్ సూపరింటెండెంట్స్ హేమలత, విజయ, నాగశ్రీలను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ కవిత, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లావణ్య

కలకడ : మండలంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య అవగాహన కల్పించారు. సోమవారం మండలస మాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై జరిగిన రైతుల అవగాహన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రీయ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం సాగు చేయడంపై మక్కువ చూపాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్‌లో 30 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సప్త సూత్రాలు పాటించి ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. పంటదిగుబడి అధికంగా పొందిన రైతులను ప్రోత్సహించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏఈపీఎం పురుషోత్తంరెడ్డి, రైతు సాధికారసంస్థ హరిప్రియ, సుబ్బరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను విక్రయిస్తే ప్లాట్లు స్వాధీనం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె రూరల్ : పట్టణంలోని పేదల కోసం నిర్మించి ఇచ్చిన టిడ్కో ఇళ్లను కొందరు విక్రయిస్తున్నట్లు లిసిందని, తమ పరిశీలనలో ఇళ్లు అమ్మినట్లు తేలితే ప్లాట్లు స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. తట్టివారిపల్లె పంచాయతీ ఎర్రగానిమిట్టలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఈ శ్రావణితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు టిడ్కో ఇళ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీధిదీపాలు, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని చెప్పుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే...కాంట్రాక్ట్ సంస్థ ఎన్‌సీసీ ఉద్యోగులను పిలిచి, మౌలికవసతులు కల్పించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...పట్టణంలో ఇళ్లులేని లబ్ధిదారులను గుర్తించి సుమారుగా 1800 మంది లబ్ధిదారులకు ప్లాట్లు మంజూరు చేశామన్నారు. వారిలో 1,700 ప్లాట్లు వరకు తాళాలు లబ్ధిదారులకు అందించామన్నారు. సుమారు 5,000 మంది వరకు ఇక్కడ నివాసం ఉండే పరిస్థితులు ఉన్నాయని, తదనుగుణంగా మౌలికవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాలకు సహకరిస్తాం


డీవైఈఓ లోకేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న సేతు,ఎంఈఓలు

మదనపల్లె సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రవేశాలకు పూర్తిగా సహకరిస్తామని విజయభారతి పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సేతు అన్నారు. సోమవారం నూతనంగా బాధత్యలు చేపట్టిన డీవైఈఓ లోకేశ్వరెడ్డిని శాలువ కప్పి సన్మానం చేశారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో 1వతరగతిలో 25 శాతం ప్రవేశాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. విద్యా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బి.కొత్తకోట,గుర్రంకొండ, తంబళ్లపల్లె, ములకలచెరువు,పుంగనూరు, కలికిరి, కలకడ మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


ఖాళీ బిందెలతో మహిళల నిరసన

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ శెట్టిపల్లి గ్రామ పరిధిలోని దిగువ హరిజనవాడలో మూడు నెలలుగా దళితులు తాగడానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర, మహిళలు పాల్గొన్నారు.

మంత్రి పీఏపై ఫిర్యాదుల వెల్లువ

టాస్క్‌ఫోర్స్ : రాష్ట్ర రవాణ, యువజన, క్రీడలశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పీఏ రెడ్డికుమార్ అవినీతి అక్రమాలపై నియోజకవర్గం నుంచి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువలా అందినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈనెల 11వ తేదిన కష్టం ఒకరిది....లాభం మరొకరికి అన్న వార్తపై టీడీపీలోని మరో వర్గం మంత్రి పీఏపై ఫిర్యాదు చేసినట్లు పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, అభిమానుల నుంచి 40 ఫిర్యాదులు అందినట్లు పార్టీ వర్గాల సమాచారం. అందిన ఫిర్యాదుల మేరకు అధిష్టానం సీరియస్‌గా పరిగణిస్తూ ఫోన్లు ద్వారా విచారణ సాగించినట్లు కూడా వినికిడి. పీఏ రెడ్డి కుమార్ సంబేపల్లి మండలంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా మంత్రి పేరు అడ్డుపెట్టుకొని చేస్తున్న దందాల విషయాలను కూడా పార్టీ అధిష్టానానికి పంపిన ఫిర్యాదులలో పూస గుచ్చినట్లు చేరవేసినట్లు సమాచారం.

ఎయిడ్స్‌పై నివారణపై అవగాహన

రాయచోటి టౌన్ : ఎయిడ్స్ /హెచ్‌ఐవీపై నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాలతో రాయచోటి జిల్లా ఎయిడ్స్, టీబీ అధికార కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో కళాజాతను ప్రదర్శించారు. కళాజాత బృందం కళాకారులు ఆటాపాటల ద్వారా హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్ర, పి. శైలజ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించండి

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థలం ప్రధాన రహదారి ప్రక్కనే ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి భారతి అన్నారు. సోమవారం స్థానిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గురు మహేష్ ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో అక్రమాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి భారతి మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తీసివేయాలని లేని పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డాక్టర్ గురు మహేష్, వీఆర్‌ఓ ముజీబ్, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలి

రాజంపేట: రాజంపేట సబ్‌డివిజన్‌పరిధిలోని వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ కోరారు. ఈ మేరకు రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ నైదియాదేవికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె రెవిన్యూ డివిజన్‌లోని వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి మణి, వీఆర్‌ఏ సంఘం నాయకులు సుధాకర్, లక్ష్మీకర్, సుండుపల్లె బాష, నందూరు పెంచలయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన సబ్‌కలెక్టర్

పీజీఆర్ఎస్‌లో భాగంగా సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభాభవనంలో ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ వినతులు స్వీకరించారు. నిబంధనల మేరకు వీలైనంత వరకు వినతులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెబ్ డెవలపర్ శిక్షణ తరగతులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌సెంటర్‌లో వెబ్ డెవలపర్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ పి.శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన యువతీ యువకులు వెబ్ డెవలపర్ కోర్సు చేయవచ్చన్నారు. యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేవీకే ఆధ్వర్యంలో రైతు సదస్సు

కలికిరి: స్థానిక కేవీకే ఆధ్వర్యంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని మర్రికుంటపల్లిలో సోమవారం రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరై కేవీకే సమన్వయకర్త కె.మంజుల మాట్లాడుతూ పంటలలో చీడపీడల నివారణకు పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, కాలుష్య రహిత వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతింటుందని, పొలంలో కొంతమేర సేంద్రీయ వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయాధికారి మమతారెడ్డి తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పవన్‌కుమార్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పీరూసాహెబ్, కే.నవీన, మాధురి, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్వరాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ డా. శాంతకుమారి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

- వైభవంగా వెంకటరమణస్వామి కల్యాణోత్సవం
- గరుడవాహనంపై విహరించిన వెంకన్న
- ఆలయంలో మార్మోగిన గోవింద నామస్మరణ

మదనపల్లె సిటీ: వేదపండితుల మంత్రోచ్చరణలు.. భక్తుల గోవిందనామస్మరణ మధ్య స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. సర్వాలంకృతులైన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటరమణస్వామి దివ్యమంగళరూపం చూసి భక్తజనం తరించారు. ఆపద్బాంధవుడు, అనాథరక్షుడైన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు అధికంగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నవవధువులుగా అలంకృతులైన శ్రీదేవి,భూదేవి పాటు వరుడు వెంకటరమణస్వామి యాగశాల నుంచి కళ్యాణ మండపం చేరుకున్నారు. వేదపండితులు అమర, బాలాజీ, లక్ష్మణ, గోవర్ధన్ భట్టార్‌లు శ్రీవారి కళ్యాణోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ముక్కోటి దేవతలు వీక్షించే స్వామివారి వివాహాన్ని సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తున్నారని వేదపండితులు తెలియజేశారు. వేదమంత్రోచ్చరణల మధ్య కళ్యాణం కన్నుల పండువగా జరిగింది.

గరుడవాహనంపై విహరించిన వెంకన్న:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కమ్మవీధి, రీడింగ్‌రూమువీధి ఉభయదారులుగా గరుడోత్సవం నిర్వహించారు. స్వామి గరుడవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన, లలితసహస్రనామ, ప్రవచనాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్ రెడ్డి, సాయిచిత్ర భాస్కర్‌నాయుడు, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ నాగేంద్ర మృతికి సంతాపం


నాగేంద్ర మృతికి సంతాపసూచకంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు

మదనపల్లె రూరల్ : శ్రీ సత్యసాయిజిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీటీ కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ నాగేంద్రకు ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. సోమవారం ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ వి.జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో నాగేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ నాగేంద్రతో తమకున్న సహచర్యాన్ని గుర్తు చేసుకుని, ఆయన మృతికి సంతాపసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, కోదండరామిరెడ్డి, రామస్వామిరెడ్డి, శివకుమార్ రెడ్డి, రామచంద్రరెడ్డి, రాటకొండ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మొలకల పౌర్ణమి


మారెమ్మ పంచలోహ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో మహిళలు


కవితమ్మకు స్వాగతం పలుకుతున్న మల్లయ్యదేవర్లు

కురబలకోట: ప్రతి ఏటా వైశాఖ పౌర్ణమినాడు నిర్వహించే మొలకలపౌర్ణమి జాతర సోమవారం మొలకవారిపల్లెలో సందడిగా సాగింది. మారెమ్మ విగ్రహాన్ని అందంగా అలంకరించారు. పంచలోహ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొలకలు పెంచి పూజలు నిర్వహించి అవి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. డీలు, బోనాలు, చాందినీ బండ్లు మెరువన, డప్పు వాయిద్యాలు, మహిళల జక్కికి పాటలు జానపద కళా ప్రదర్శనలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మంగళవారం మధ్యాహ్నం ఉట్లమాను ఉత్సవం వేడుకగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

మొలకల పౌర్ణమి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై వెలసి శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మొలకల పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ, కుమారుడు అభినయ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వారు మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున, మల్లయ్యదేవర్లు సంప్రదాయబద్ధంగా ఢమరుకం వాయిస్తూ స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మ ఆలయం, ఏనుగుమల్లమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. వారి వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రామమూర్తి, నారాయణరెడ్డి, కరీమ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

గ్రామదేవత వాయిల్‌చెట్ల గంగమ్మజాతరకు గ్రామస్థులు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డికి రావడంతో సోమవారం పంచాలమర్రిలో మహిళలు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఎలాంటి సమస్య వచ్చి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డి.వెంకటరమణారెడ్డి, ఎల్‌ఐసి రమణారెడ్డి, మధుకర్‌రెడ్డి, పీజె వెంకటరమణారెడ్డి, రాజన్న, అమర,శివకుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ.. మాగోడు పట్టించుకోరా ?

- చినుకు పడితే చిత్తడే
- కందుకూరు ఎస్సీ కాలనీ వాసుల అవస్థలు


కందికూరు ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు ఎస్సీ కాలనీ వాసులు నివాస గృహాల నడుమ నరకయాతన పడుతున్నారు. కాలనీలో 30 నివాస గృహాలు ఉండగా ఒక మురుగు నీటి కాలువ కూడా లేదు. వర్షం కురిస్తే నీరంతా ఇళ్ల ముందు కుంటలను తలపిస్తాయి. వర్షపు నీరు పారే అవకాశం లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఆరు బయట నడిచే ముసలీ, ముతకా పడి లేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అంతేగాక నిల్వ చేరిన మురుగు నీరంతా దుర్వాసన వెదజల్లుతుండటంతో ముక్కులు మూసుకుని జీవనం గడపాల్సిన దుస్థితి నెలకొంటోందని కాలనీ వాసులు వాపోతున్నారు. నీరంతా కలుషితమై దోమలు ప్రబలి ప్రజలు జ్వరాల బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఇటీవల పంచాయతీ కార్యదర్శి మనోహర్ దృష్టికి తీసుకెళ్లగా తాత్కాలికంగా నీరు పారేందుకు ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయినా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల నిర్మాణం చేపడితే శాశ్వతంగా సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు అంటున్నారు.